కలుపు నివారణే కీలకం

- వరిసాగులో కలుపు బెడద
- దిగుబడిపై ప్రభావం
- నియంత్రిస్తే మంచి ఫలితాలు


రంగంపేట మండలంలో సాగవుతున్న వరి పంట

రంగంపేట: వరిసాగులో రైతులకు కలుపుతీత ప్రధానమైనది. సకాలంలో దాన్ని చేపట్టడం వల్ల నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులందరూ ఇటీవల ఎక్కువగా వెదజల్లు విధానంలో సాగు చేయడం వల్ల సాధారణంగా కలుపు అధికంగా ఉంటోంది. దాన్ని అలాగే వదిలేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పంటల్లో పెరిగే ఇతర గడ్డి మొక్కలనే కలుపు అంటారు. సాగు భూముల్లో ఈ మొక్కలు ప్రధాన పంట కంటే త్వరితగతిన పెరిగి పోషకాలు, ఎరువులను స్వీకరించి దిగుబడిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కలుపును నివారించకుంటే తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు ఎరువులు, పురుగు మందుల వినియోగం భారీగా పెరిగిపోతుంది. నాణ్యమైన పంటలు పండించడంలో అధిక దిగుబడులు సాధించడంలో విఫలమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి.

గడ్డి జాతి మొక్కలు

కలుపు మొక్కలో సాధారణంగా పంటకు ఎక్కువ హాని కలిగించే వాటిల్లో ఊదర, వెడల్పాకు, తుంగ, ఏక వార్షిక తదితర గడ్డి జాతులు ఉంటాయి. వీటి నివారణకు సాధ్యమైనంత మేరకు వ్యవసాయ శాఖ సూచనల మేరకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. సాధారణంగా రైతులు పొలాల్లో నిర్దిష్ట సమయంలో కూలీలతో కలుపును తీయించేవారు. కూలీల కొరత ఎక్కువ కావడంతో పాటు, కూలి రేట్లు గణనీయంగా పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబిస్తున్నారు.

సూచనలు పాటించాలి

కలుపు నివారణకు అనేక అనేక రసాయన మందులను రైతులు పిచికారీ చేయిస్తున్నారు. హెర్బిసైడ్ వంటి అనేక మందులు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించకుండా వీటిని వినియోగిస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు ఏ విధమైన మందులు, ఎంత మోతాదులో వినియోగించాలో రైతులకు అవగాహన ఉంటే, కలుపును పూర్తిగా నిర్మూలించి, అధిక దిగుబడులు సాధించవచ్చు అని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మందుల వినియోగం

వరి సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కలుపు మొక్కల నివారణకు ప్రత్యేక మందులను వినియోగించాలి. వరి నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లో ప్రెటిలాకోర్ ద్రావణం 500 మి.లీ లేదా ఆక్సాడయార్జిల్ 20 గ్రాముల మందును నీటిలో కరిగే గుళికలతో మిశ్రమం చేసి చల్లాలి. పెట్ సల్ఫ్యూరాన్ లేదా క్లోరిమ్యూరాన్ ఈథేల్ ఎనిమిది గ్రాముల మందును రెండు నుంచి నాలుగు ఆకుల దశలో పిచికారీ చేయాలి. పెనాక్సులం లేదా సైహాలోపాస్ బ్యూటైల్ ద్రావణాన్ని 900 మి.లీ పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు చనిపోతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల కలుపు మందులు లభిస్తున్నాయి. వరి పొలాల్లో పిచికారీ చేసే క్రిమిసంహారక మందును ఎంత మోతాదులో, ఏ సమయంలో, ఎలా వాడాలో అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే వినియోగించాలి. సిఫారసు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. అలా వాడితే కలుపు నిర్మూలన సరిగ్గా జరగక పోగా, కొన్ని సందర్భాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కలుపు మందును ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వినియోగించరాదని, కలుపు నివారణకు ఎల్లప్పుడూ ఒకే మందు వాడరాదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 59 వేల ఎకరాలలో ఖరీఫ్‌లో వరి సాగవుతోంది. అనపర్తి మండలంలో 12 వేల ఎకరాలు, పెదపూడి మండలంలో 18,500 ఎకరాలు, బిక్కవోలు మండలంలో 13 వేలు ఎకరాలు, రంగంపేట మండలంలో 11 వేల ఎకరాల్లో పండిస్తున్నారు.

యాజమాన్య పద్ధతులే కీలకం



కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనం నాటి నప్పటి నుంచి కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోకపోతే పంట తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

క్రైస్తవులను పట్టించుకోని కూటమి



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

రాజానగరం: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం క్రైస్తవులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ఎటువంటి సహాయ, సహకారాలు అందడం లేదని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం. విజయసారథి అన్నారు. మండలంలోని దివాన్ చెరువు బీజాపురి టౌన్‌షిప్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయి క్రిస్టియన్ మైనార్టీ సెల్ సమావేశం జరిగింది. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా క్రిస్టియన్ల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతనానికి మన వంతు కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తిన జోనాథన్, రంగంపేట మండల అధ్యక్షుడు స్వర్ణనరాజు, ప్రతినిధులు సుధాకర్, ప్రకాష్, చిట్టిబాబు, అరుణ్, అబ్రహం పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు రంగంపేట మండల సమావేశం

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు సీనియర్ అసిస్టెంట్ బీవీవీఎస్ రామాంజనేయులు తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జెట్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబుతో పాటు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతి నిధులు హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికతో రావాలన్నారు.

రేపు సీతానగరంలో..

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సీతానగరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల అభివృద్ధిపై చర్చ ఉంటుందన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖాల అధికారులు హాజరుకావాలని కోరారు.

త్రిముఖ లింగేశ్వరస్వామికి పూజలు


త్రిముఖలింగేశ్వరస్వామి

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి వద్ద కొలువైన బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకట రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

సీతానగరం: వెదుళ్లపల్లి శివారున పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ. 5,190 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిలో ఇద్దరు రఘుదేవపురం, నలుగురు వెదుళ్లపల్లికి చెందిన వారన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

శ్మశానంలో తుప్పల తొలగింపు

పెదపూడి: దోమాడలోని శ్మశాన వాటిక ఆధునీకరణకు కృషి చేస్తున్నామని ఆ గ్రామ సర్పంచ్ మీనవల్లి శారదాదేవి అన్నారు. ఆ శ్మశాన వాటికలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, తుప్పలను సోమవారం జేసీబీతో తొలగించారు. ఈ పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సచివాలయం అధికారి వీ.శ్రీనివాసమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో పందలపాక విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బిక్కవోలు: పందలపాకలోని పడాల పెదపుల్లారెడ్డి ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు సీహెచ్ కార్తిక సూర్య, ఎల్.సతీష్, గుత్తుల దినేష్ వర్ధన్ కుమార్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. కాకినాడలో శుక్రవారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్ 19 స్విమ్మింగ్ పోటీలలో వీరు ప్రతిభ చూపారన్నారు. దీంతో త్వరలో జరిగే ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. వీరికి శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డిని అభినందించారు.

అన్నసమారాధన

సీతానగరం: లంకూరులోని రామదుర్గ వడ్డీల యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులు తరలి వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

108 వాహనం ప్రారంభం

రాజానగరం: మండలానికి మంజూరైన 108 నూతన వాహనాన్ని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, తహసీల్దార్ జీఏఎస్ఎల్ దేవి, వైద్యాధికారి డాక్టర్ రామభాస్కర్, కూటమి నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

కోరుకొండ: ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా స్థాయిలో ఎంపికైన ఐదుగురికి, మండల స్థాయిలో ఎంపికైన 12 మందిని సోమవారం ఘనంగా సత్కరించారు. కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్లో ఎంఈవో టి.కుశలవదొర అధ్యక్షతన సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాణ ప్రదాతలన్నారు.

మేధ సాంకేతిక ఉత్సవం ప్రారంభం


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీజీయూ చాన్సలర్ చైతన్య రాజు

రాజానగరం: శాస్త్ర, సాంకేతిక రంగాలలో వస్తున్న విప్లవాత్మక మార్పులను యువత ఆకళింపు చేసుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) అన్నారు. భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా క్యాంపస్‌లో సోమవారం నిర్వహించిన మేధ సాంకేతిక ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సమాజాభివృద్ధిలో ఇంజినీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) మన జీవితాలలో అనేక అంశాలను మార్చగల సామర్థ్యం కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రొ. వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పేదలకు అన్యాయం

కోరుకొండ: కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న పీపీపీ విధానంలో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు విమర్శించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు అన్యాయం జరిగే ఈ విధానాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లు తీసుకురావడం అభినందనీయమన్నారు. అయితే పేద వర్గాలకు అన్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ద్వారా పేద విద్యార్థులకు సీట్లు దొరుకుతాయని, విదేశాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి కూడా ఉండదన్నారు. పీపీపీ పేరిట వైద్య విద్యను కార్పొరేట్ సంస్థలకు అమ్మేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు.

రాట ముహూర్తం


రాట వేస్తున్న అర్చకుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదపూడి: విజయదశమి ఉత్సవాలకు సంబంధించి సంపర గ్రామంలోని విజయ దుర్గమ్మ ఆలయం వద్ద పందిరి రాట మహూర్తం చేశారు. ముందుగా విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు మాట్లాడుతూ శరన్నవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు.

సేల్స్ ట్యాక్స్ చెల్లింపులు సక్రమంగా ఉండాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రాజానగరం: సేల్స్ టాక్స్ చెల్లింపులు సక్రమంగా ఉంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని, కావాలని ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తే మాత్రం తిప్పలు తప్పవని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సేల్స్ ట్యాక్స్ (రాజమహేంద్రవరం) ఏవీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ ఎ.సురేష్ హెచ్చరించారు. గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల వర్తకులతో వృత్తి పన్ను, సేల్స్ ట్యాక్స్ చెల్లింపులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృత్తి పన్ను, జీఎస్టీ పరిధిలోని వివిధ అంశాలపై వ్యాపారస్తులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంకటాల సత్తిపండు, ఉపాధ్యక్షుడు లంక శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ పరివార్ కార్యక్రమంపై అవగాహన


సీతానగరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వస్థ నారీ శ్వశక్త పరివార్ కార్యక్రమంపై పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, ఈ.ఏసురాణి ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకూ ప్రతి గ్రామంలో స్త్రీలకు, పిల్లలకు కాన్సర్ స్క్రీనింగ్, మధుమేహం, బీపీ, రక్తహీనత, క్షయ పరీక్షలు, గర్భిణులు, బాలింతలకు సేవలు, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్, సైకిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, పోషకాహారంపై అవగాహన మొదలగు కార్యక్రమాలు ఆరోగ్య సిబ్బందితో నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం సీతానగరం పీహెచ్‌సీ ఆవరణలో ప్రారంభిస్తామన్నారు. అక్టోబర్ 11న ప్రపంచ బాలిక దినోత్సవం సందర్భంగా సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో బాలికల రక్షణ, వారి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వస్థ నారీ శ్వశక్త పరివార్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెదలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే


రామారెడ్డి, సాల్మన్ రాజులను సన్మానిస్తున్న యూనిట్ సభ్యులు

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీఎస్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కేజీకే మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనిట్ కార్యదర్శి గొలుగూరి రామారెడ్డి, కె.సాల్మన్‌రాజులు విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలు, ఆయన సేవలను వివరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇంజినీర్లు ఎంవీ కృష్ణారెడ్డి, ఎస్.వెంకట రామారెడ్డిలను సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నరాలశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

అనపర్తి: ఇంటర్మీడియట్‌లో ఇష్టపడి, కష్టపడి చదివితే భవిష్యత్తులో మంచి కోర్సులైన ఎన్ఐటీ, ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి కోర్సులకు సునాయాసంగా అర్హత సాధించి భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాల్లో స్థిరపడతారని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఎంఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. అనపర్తి జీబీఆర్ కళాశాలలో సోమవారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయనతో పాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ డాక్టర్ పి.త్రినాథ రాజా ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముందుగా కొత్తగా ఇంటర్మీడియట్‌లో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థులు పలు కళా ప్రదర్శనలు ప్రదర్శించి ఆహూతులను అలరించారు. ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు, ఇతర బహుమతులు, క్రీడల్లో ప్రావీణ్యం చూపిన విద్యార్థులకు పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అడ్వైజర్ జి.జగన్నాథరెడ్డి, డిగ్రీ డైరెక్టర్ డీవీఆర్‌ఏ పాపిరెడ్డి, కె.హరినాథ్ రెడ్డి, జూనియర్ కళాశాల డైరెక్టర్ మల్లిడి ఉమా వెంకట్‌రెడ్డి, జీబీఆర్ స్కూల్స్ డీన్ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


బహుమతులతో మెళ్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ ఉపాధ్యాయులు కామాక్షి విద్యార్థులకు హిందీ భాషా ప్రాముఖ్యతపై వ్యాసరచన, వక్తృత్వం, పద్యాల పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి సోమవారం బహుమతులు అందించారు. హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు గొలుగూరి వెంకట రామారెడ్డి, ఎండీటీఆర్ షరీఫ్, పీడీ బషీర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


అనపర్తిలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు


జి.మామిడాడలో ఉట్టి సంబరం

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో వైష్ణవ సాంప్రదాయ పద్ధతిలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక సూర్య నారాయణ స్వామివారి దేవస్థానంలో దశాబ్దాల చరిత్ర గల వేణుగోపాల స్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సూర్యదేవాలయం వద్ద ఉట్టి ఉత్సవం జరిపారు.

అనపర్తిలో..

అనపర్తి : గ్రామంలోని సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయంలో శ్రీకృష్ణ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణ, శ్రీకృష్ణ పరమాత్మునికి తులసి పూజ, శాస్త్రీయ నృత్యం, చిన్నారుల గోపిక, శ్రీకృష్ణ వేషధారణలు, కోలాటం, ఉట్టి సంబరం ఘనంగా నిర్వహించారు.

ఘనంగా హిందీ దినోత్సవం

కోరుకొండ: మండలంలోని గుమ్ములూరు హైస్కూల్లో సోమవారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం గంగాభవాని మాట్లాడుతూ హిందీ ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు. హిందీ ఉపాధ్యాయురాలు యాళ్ల సుమతిని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాకబ్‌రాజు, రామకృష్ణ, మధు పాల్గొన్నారు.

జానపద కళా ఉత్సవ్‌లో సత్తా

అనపర్తి: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి జానపద కళా ఉత్సవ్‌లో పులగుర్త ఆర్ఐవీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బొమ్మూరు డైట్ కళాశాలలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో జానపద నృత్య విభాగంలో సింధు, భువనేశ్వరి, హారిక, దుర్గ ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానంలోనూ, జానపద గేయ విభాగంలో శిరీష, భవాని, సునీత, రాజీలు తృతీయ స్థానంలోనూ, క్రాఫ్ట్ విభాగంలో జెస్సీ, జయ తృతీయ స్థానాల్లో నిలిచారు. వారిని, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, రత్నకుమార్, ఉమాదేవిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సీతామహాలక్ష్మి అభినందించారు.


ప్రతిభ కనబరిచిన పులగుర్త విద్యార్థులు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రాజానగరం: దివాన్ చెరువు శివారు ఆటోనగర్‌లోని మెకానిక్ షెడ్‌లో పని చేస్తున్న ఒక వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై ప్రియ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన కృష్ణకుమార్ సాకేత్ 15 ఏళ్ల క్రితం ఇక్కడకు వలస వచ్చాడు. రాజమహేంద్రవరంలో భార్యాపిల్లలతో కలసి ఉంటూ, ఆటోనగర్‌లోని చరణ్‌సింగ్‌కు చెందిన మెకానిక్ షెడ్డులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి భార్య సరోజ్ సాకేత్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సమస్యలపై రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందాయి. ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ వీటిని అందుకున్నారు. కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, టైపిస్ట్ సతీష్, వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహిళల కిక్ బాక్సింగ్‌లో పతకాలు


కిక్ బాక్సింగ్‌లో విజేతలుగా నిలిచిన బొమ్మూరు అకాడమీ విద్యార్థినులు

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలోని బాక్సింగ్ హాల్లో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా మహిళల కిక్ బాక్సింగ్ పోటీల్లో బొమ్మూరు శ్రీమారుతి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎం.సహాన బంగారు, దిల్నాస్ సాహె రజత, ఎం.రిషిత రజిత, కాంస్య, కె.పూర్ణిమ స్వర్ణ, కాంస్య పతాకాలు సాధించారు. వారిని, కిక్ బాక్సింగ్ జిల్లా ప్రెసిడెంట్ ఎం.గణేష్, సెక్రటరీ, రిఫరీగా వ్యవహరించిన ఎస్.గిరి వెంకటరమణ, కోశాధికారి ఎం.భవానీశంకర్‌లను రాష్ట్ర ప్రెసిడెంట్, ఆర్గనైజర్ జి.ఆనందబాలు, విశాఖ ప్రెసిడెంట్ జోగారావు, సెక్రటరీ సంతోష్‌కుమార్ అభినందించారు.